ఆగిపోయిన అభివృద్ధికి మోక్షమెప్పుడో.?

- ఊర చెరువును పట్టించుకోని అధికారులు
- నిలిచిన రూ. 10 కోట్ల విలువైన ప్రాజెక్టు పనులు
- కంపచెట్లు, పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారిన చెరువు


జగ్గయ్యపేటలోని ఊర చెరువు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ ప్రజల చిరకాల స్వప్నం ఊర చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే ప్రాజెక్టు ఏడాది క్రితం మొదలై నిలిచిపోయింది. ప్రభుత్వం మారడంతో జిల్లాలోనే మేటి పర్యాటక కేంద్రంగా సుమారు రూ. 10 కోట్లతో రూపొందించాలనుకున్న ఈ ప్రాజెక్టు దాదాపు 80 శాతం పూర్తయినప్పటికీ అర్థాంతరంగా నిలిచిపోయింది. ప్రస్తుతం దీనిని పట్టించుకునే నాథుడు లేక కంపచెట్లు, పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారింది.

మూడు విభాగాలుగా అభివృద్ధి పనులు

చెరువు అభివృద్ధి పనులను మూడు విభాగాలుగా చేసి నిర్మాణ పనులు చేపట్టారు. ఫేస్-1లో కొత్త రైతుబజారు నుంచి కట్టమీద ఆంజనేయస్వామి ఆలయం వరకు, ఫేస్-2లో కొత్త రైతు బజారు నుంచి కృష్ణుడు ఆలయం వరకు, ఫేస్-3లో కృష్ణుడు ఆలయం నుంచి కట్టమీద ఆంజనేయస్వామి ఆలయం వరకు అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఫేస్-1లో ఇప్పటికే చుట్టూ రివిటింగ్, ఫెన్సింగ్, కాంపౌండ్ వాల్, వాకింగ్ ట్రాక్, గ్రీనరీ వంటి 80 శాతం పనులు పూర్తయ్యాయి. అయితే చెరువుకు నాలుగు వైపులా రోడ్ల అభివృద్ధి, చుట్టూ వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్స్, చిల్డ్రన్స్ ప్లేగ్రౌండ్ గ్రీనరీ, ఫ్లవర్ గార్డెన్, బోట్ షికారు, లైటింగ్, మ్యూజికల్ వాటర్ ఫౌంటెయిన్స్, హెల్తీ వాక్‌గ్రౌండ్, స్నాక్ కౌంటర్ తదితర పనులు తీర్చిదిద్దాల్సి ఉంది.


అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు

అధ్వానంగా మారిన చెరువు

చెరువు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతూ వస్తున్న సమయంలో ఎన్నికలు సమీపించడంతో ప్రాజెక్టు పూర్తి కాకుండానే గత మార్చి 12న ప్రారంభించారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో పట్టించుకునే వారు లేక ఈ ప్రాజెక్టు నిరాదరణకు గురయింది. వాకింగ్ ట్రాక్ అంతా పిచ్చిమొక్కలు, కంప చెట్లు పెరిగి అధ్వానంగా మారింది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం చెరువుపై దృష్టి సారించి ప్రాజెక్టును పూర్తి చేయాలని పేట ప్రజలు కోరుతున్నారు.

గత వైఎస్సార్ సీపీ హయాంలో ప్రణాళికలు

నియోజకవర్గ కేంద్రంగా, మున్సిపాలిటీగా ఉన్న జగ్గయ్యపేట పట్టణ నడిబొడ్డున సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో ఊర చెరువు ఉంది. పట్టణం నుంచి వచ్చి కలిసే వ్యర్థాలు, మురికి నీటితో చెరువు పూర్తిగా కలుషితమైంది. అంతేకాకుండా ఆక్రమణలకు గురై భవిష్యత్‌లో కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. దీంతో చెరువును ప్రక్షాలన చేసి ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపొందించాలని నిర్ణయించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏడాదిన్నర క్రితం ఊర చెరువును సుమారు రూ. 10 కోట్లతో ప్రణాళికను రూపొందించి అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రభుత్వంతో పాటు దాతలు, పట్టణ సమీపంలో ఉన్న వివిధ కర్మాగారాల యాజమాన్యాల సహకారంతో సుందరీకరణ పనులు చేపట్టారు. హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్, మల్కం చెరువు మాదిరిగా పేట చెరువును అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించే విధంగా అన్ని హంగులతో పనులు ప్రారంభించారు. తొలి విడతగా రూ. 5 కోట్లతో పనులు పూర్తిచేసి, రెండవ విడతగా మరొక రూ. 5 కోట్లతో అభివృద్ధి చేస్తూ వచ్చారు.

గ్రీనరీ ఎండిపోయింది



గ్రీనరీ మొక్కలు నీరు పోసేవారు లేక ఎండిపోయాయి. పశువులు కూడా లోపలకు ప్రవేశిస్తుండటంతో గ్రీనరీ రూపురేఖలు లేకుండా పోయింది. బయట నుంచి లోపలకు వెళ్లే వేపలవాగు, ఎర్రకాలువల నీరంతా గుర్రపుడెక్కతో నిండిపోయి మురుగు కంపు కొడుతూ ఉంది. స్థానిక ప్రజాప్రతినిధులు దీనిని పట్టించుకుని ప్రాజెక్టును పూర్తిచేయాలి.

గంగోలు వినోద్, జగ్గయ్యపేట

ప్రాజెక్టును పూర్తిచేయాలి



ఒక ప్రభుత్వంలో మొదలైన పనులు మరొక ప్రభుత్వంలో ఆగిపోకుండా ఉంటేనే అభివృద్ధి కొనసాగుతుంది. జిల్లాలోనే మేటి పర్యాటక కేంద్రంగా చేపట్టిన ఈ చెరువు ప్రాజెక్టుపై ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ దృష్టి సారించి పూర్తి చేయాలి. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించాలి. ఇటీవలే కౌన్సిల్ మీటింగ్‌లో కూడా దీని గురించి ప్రశ్నించాను.

షేక్ హఫీజున్నీసా, మున్సిపల్ వైస్ చైర్మన్

త్వరలో పూర్తి చేస్తాం



జగ్గయ్యపేటకు మణిహారంగా రూపొందుతున్న పర్యాటక కేంద్రమైన చెరువు అభివృద్ధి ప్రాజక్టును ఎట్టి పరిస్థితుల్లో అశ్రద్ధ చేసే ప్రసక్తి లేదు. మున్సిపాలిటీ ప్రతిష్టను పెంచే ఈ డ్రీమ్ ప్రాజెక్టును పూర్తి చేయడానికి కావాల్సిన నిధులు తీసుకువచ్చి దీనిని విజయవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ చైర్మన్

నేడు అన్ని గ్రామాల్లో అంబేడ్కర్ వర్ధంతి

జగ్గయ్యపేట అర్బన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం జగ్గయ్యపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉదయం ఆరు గంటలకు అంబేడ్కర్‌కు నివాళులర్పించాల్సిందిగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

- భారత రత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం పట్టణంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన జరుగుతుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు పట్టణంలోని రైతుబజారు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొంటారని తెలిపారు. కావున ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వాహనాల తనిఖీ

జుజ్జూరు(వీరులపాడు): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ అనిల్ హెచ్చరించారు. మండలంలోని జుజ్జూరు గ్రామ శివారులో గురువారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వాహనదారులు విధిగా రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, త్రిపుల్ రైడ్ చేయకూడదని పేర్కొన్నారు. అనంతరం రికార్డులు సక్రమంగా లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను గుర్తించి జరిమానా విధించారు. తనిఖీల్లో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం



కంచికచర్ల: రైతులు దళారుల చేతిలో మోసపోకుండా పత్తిని భారత పత్తి సంస్థ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని అప్పుడే మద్దతు ధర లభిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో సీసీఐ ప్రతినిధులతో కలిసి గురువారం ఆమె కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీసీఐ పత్తి క్వింటాకు రూ. 7,521లు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. పత్తి కొనుగోళ్లలో ఎటువంటి అవకతవకలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీసీఐ బయ్యర్ నాయక్, ఏఎంసీ కార్యదర్శి ఎస్ శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

10 నుంచి వెంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఏసీ వరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తేదీన విష్వక్సేన పూజ, రక్షాబంధనం, వాస్తుపూజ, వాస్తు హోమం, 11న పవిత్ర శుద్ధి, అగ్నిమదనం, మహాశాంతి హోమాలు, 12న స్వామివారికి అభిషేకం, పవిత్ర ఆరోహణ, స్వామివారి శాంతి కల్యాణం, 13న పవిత్ర విసర్జన, లక్ష తులసీదళ అర్చన, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయుడిపై దాడి హేయం



నందిగామ టౌన్: ఉపాధ్యాయుడిపై దాడి హేయమని ఈ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) మండల నాయకులు నాగేశ్వరరావు, బెనర్జీ డిమాండ్ చేశారు. దోషులను శిక్షించడంతో పాటు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఎంఈఓ పద్మావతికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్‌పై విద్యార్థులు దాడి చేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘ నాయకులు కుంచం లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

నందిగామ టౌన్: మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని మామిడి తోటల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా సీఐ వైవీఎల్ నాయుడు మాట్లాడుతూ గ్రామ సమీపంలోని మామిడి తోటల్లో పేకాడుతున్నారనే సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో 23 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి సుమారు రూ. 1.30 లక్షల నగదు, ఏడు కార్లు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అసాంఘిక క్రీడలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్‌ఐ అభిమన్యు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సుస్వరాల సంగమం చిత్ర గీతాల గానం

విజయవాడకల్చరల్: రాగలహరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై గురువారం నిర్వహించిన చిత్ర గీతాల కార్యక్రమం మధురంగా సాగింది. గాయని మల్లాది స్వాతి పర్యవేక్షణలో, వడ్డాది సూర్య కామేశ్వరి, పరమేశ్వరి, షబానా, అయ్యప్పన్ సాయి కృష్ణ, డి.మోహన రాజు, రామాంజీ తదితరులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను మధురంగా ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి ఏపీఎల్‌ఏ అథారిటీ టి.వేణుగోపాల్ మాట్లాడుతూ గాయనీ గాయకులు స్వయం కృషితో విజయాలు సాధించాలని సూచించారు. విలువలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకుల కృషిని అభినందించారు. సంస్థ వ్యవస్థాపక సభ్యుడు మీరాకుమార్ మాట్లాడుతూ.. విలువలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తూ నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తోందన్నారు. విశ్రాంత ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎస్ఏవీ ప్రసాదరావు, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎల్ఎస్ఎం రమాశ్రీ చేతులమీదుగా సంస్థ లోగోను ఆవిష్కరించారు. మీరాకుమార్, చింతకాయల చిట్టిబాబు, బి.వీరభద్రరావు, ముష్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు


కంచికచర్ల తహసీల్దార్ జాహ్నవి

కంచికచర్ల: దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు మండలంలోని ఆయా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పీ జాహ్నవి పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈనెల ఆరు నుంచి వచ్చే సంవత్సరం జనవరి ఎనిమిదవ తేదీ వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. ఈ సదస్సులు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు గ్రామ సచివాలయాల్లో జరుగుతాయని తెలిపారు. శుక్రవారం గొట్టుముక్కల, 10వ తేదీ బత్తినపాడు, 11న గండేపల్లి, 12న కీసర, 13న గనిఆత్కూరు, 17న కొత్తపేట, 18న కునికెనపాడు, 19న మోగులూరు, 20న శౌరీ అమరవరం, 21న వేములపల్లి, 26న చెవిటికల్లు, 27న కంచికచర్ల, 28న మున్నలూరు, 31న పెండ్యాల, జనవరి 03న పేరకలపాడు, 04న పరిటాల సదస్సులు జరుగుతాయని పేర్కొన్నారు.

- **నందిగామ టౌన్:** గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సురేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. శుక్రవారం కొణతమాత్మకూరు, తొమ్మిదిన పెద్దవరం, 10న కంచల, 12న రాఘవాపురం, 13న సోమవరం, 16న కొండూరు, 17న మాగల్లు, 18 నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 19న లచ్చపాలెం, 20న తక్కెళ్లపాడు, 21న లింగాలపాడు, 23న అడవిరావులపాడు, మునగచర్ల, 24న చందాపురం, కె.కంద్రిక అగ్రహారం, 26న కేతవీరునిపాడు, 27న అంబారుపేట, 28న ఐతవరం, 30న పల్లగిరి, 31న సత్యవరం, జనవరి రెండున గోళ్లమూడి, మూడున రుద్రవరం, నాలుగున దాములూరు, ఆరున తొర్రగుడిపాడు, ఏడున రామిరెడ్డిపల్లి, ఎనిమిదిన జొన్నలగడ్డ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
- **పెనుగంచిప్రోలు:** గ్రామాల్లో ఉన్న భూ వివాదాల పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎ. శాంతి లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ రోజు ఏ గ్రామంలో సదస్సు జరుగుతుందో గ్రామ పంచాయతీ ద్వారా ముందే తెలియజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.
- **వత్సవాయి:** మండల పరిధిలో రెవెన్యూ సదస్సులు శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు తహశీల్దార్ ఎస్ నరసింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మండలంలోని గోపినేనిపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో సదస్సు జరుగుతుందని చెప్పారు.
- **వీరులపాడు:** మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హుసేన్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం వెల్లంకి, తొమ్మిదవ తేదీన గోకరాజుపల్లి, 11న జుజ్జూరు, 12న చెన్నారావుపాలెం, 13న జమ్మవరం, 16న బోడవాడ, 17న తాటిగుమ్మి, 18న పొన్నవరం, 19న జగన్నాథపురం, 20న నందలూరు, 21న దాచవరం, 24న చౌటపల్లి, 26న వీరులపాడు, 27న రంగాపురం, 28న కొణతాలపల్లి, 30న పల్లంపల్లి, 31న వీఅన్నవరం, జనవరి రెండున దొడ్డదేవరపాడు, మూడున గూడెంమాధవరం, నాలుగున పెద్దాపురం, ఆరున చట్టన్నవరం, ఏడున అల్లూరు, ఎనిమిదిన నరసింహారావుపాలెం, తొమ్మిదిన చెన్నారావుపాలెం గ్రామాల్లో సదస్సులు జరుగుతాయని పేర్కొన్నారు.

అయ్యవార్లు లేక అటకెక్కిన చదువులు


జగ్గయ్యపేటలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల

- ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల సమ్మెబాట
- పదో తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తికాని వైనం

పెనుగంచిప్రోలు: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ గిరిజన గురుకుల పాఠశాలల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెబాట పట్టారు. దీంతో విద్యా సంవత్సరం చివరి దశలో బోధనకు ఆటంకం ఏర్పడింది. రివిజన్‌కు సిద్ధమవ్వాల్సిన సమయంలో పాఠాలే జరగడం లేదు. సమ్మెను విరమింపజేయాల్సిన ప్రభుత్వం తాత్సారం చేయడంతో గిరిజన గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల చదువులు అటకెక్కాయి.

ఆందోళనలో విద్యార్థులు

జగ్గయ్యపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలురు)లో ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు మొత్తం 172 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో పదో తరగతి విద్యార్థులు 35 మంది ఉన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు అందరూ సమ్మెకు దిగడంతో పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయులతో ఐఎఫ్‌బీ ప్యానెల్స్‌పై పాఠాలు చెప్పిస్తున్నారు. సబ్జెక్ట్ బోధించే ఉపాధ్యాయులు లేకపోవడంతో తమ పరిస్థితి ఏమిటని విద్యార్థులు వాపోతున్నారు. మార్చి 15 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఉపాధ్యాయులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మొత్తం 12 మంది సిబ్బంది ఉండగా 10 మంది ఔట్‌సోర్సింగ్ వారే ఉన్నారు.

ఉద్యోగ భద్రత కావాలంటూ సమ్మె

ఏళ్లతరబడి ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ పలుమార్లు టీచర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అధికారంలోకి వస్తే ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత తమను పట్టించుకోవడం లేదని టీచర్లు వాపోతున్నారు. మెగా డీఎస్సీ నుంచి తమ పోస్టులకు మినహాయింపు ఇవ్వాలని, 2022 పీఆర్‌సీ ప్రకారం జీతాలు చెల్లించాలని, రెగ్యులర్ లేదా కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లు(సీఆర్‌టీ)గా మార్పు చేయాలనే తదితర డిమాండ్లతో గిరిజన పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ టీచర్లు నవంబర్ 16 నుంచి సమ్మె చేస్తున్నారు. దీంతో బోధన ఆగిపోయింది. సమ్మె కారణంగా తమ పిల్లల చదువులు నిలిచిపోతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తి కాలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించి బోధన సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.


ఐఎఫ్‌బీ ప్యానెల్స్‌పై పాఠాలు వింటున్న విద్యార్థులు

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

కన్నెవీడు(వత్సవాయి): రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవాలని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కే అచ్యుతరాజు సూచించారు. ప్రపంచ నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గరికపాడు కృషి విజ్ఞానకేంద్రం వారి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరించారు. ఇటువంటి ఎరువులు వాడటం వల్ల భూములు నిస్సారంగా మారి సమస్యాత్మక నేలలుగా మారిపోతాయన్నారు. చౌడు భూములుగా మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. సేంద్రీయ ఎరువుల వాడకం వల్ల భూమిలో సారం పెరిగి పెట్టుబడులు తగ్గుతాయన్నారు. ముఖ్యంగా పశువులు, మేకలు, కోళ్ల వంటి ఎరువులతోపాటు పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకోవాలని సూచించారు. అనంతరం రైతులతో సేంద్రీయ ఎరువులు వాడి భూములను కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పి.ఎస్. శివప్రసాద్, ఐ. వెంకటరెడ్డి, ఎన్. రాజశేఖర్, టి. జస్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సేంద్రీయ ఎరువులు వాడుతామని ప్రతిజ్ఞ చేస్తున్న రైతులు

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవాలు

నందిగామ టౌన్: పట్టణంలో వేంచేసి ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివారి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ మహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విష్వక్సేనారాధన, రుత్విగ్వరణ, అంకురారోహణం, హోమాది క్రతువులు నిర్వహించారు. శుక్రవారం స్వామివారికి అభిషేకం, పెండ్లి కుమారుని చేయుట, నిత్య హోమం, ఏడున స్వామివారి కల్యాణం, అన్నప్రసాద వితరణ, ఎనిమిదిన నిత్య హోమం, పూర్ణాహుతి, స్వామివారి గ్రామోత్సవం, తొమ్మిదిన దీపోత్సవం, ఊంజల సేవ తదితర పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

అలరించిన భక్తి సంగీతం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో తెనాలికి చెందిన డాక్టర్ ఓ.రమేష్‌బాబు బృందం ఆలపించిన భక్తి గీతాలు భక్తులను అలరించారు. ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై పలు కీర్తనలు ఆలపించారు. రమేష్‌బాబుకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు.

మార్కపూడి గాంధీకి సన్మానం

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కపూడి గాంధీని ఆ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, పలువురు నాయకులు గురువారం అభినందించారు. జగ్గయ్యపేటలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన అభినందన కార్యక్రమంలో తన్నీరు నాగేశ్వరరావుతో పాటు పలువురు నాయకులు ఆయనను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, పేట పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బత్తుల రామారావు, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బద్దూ నాయక్, నాయకులు మన్నె అప్పారావు, ఎ. గోపి తదితరులు పాల్గొన్నారు.


మార్కపూడిని సన్మానిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

తిరువూరు: దీర్ఘకాలం అధిక ఆదాయాన్నిచ్చే పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని తిరువూరు ఉద్యాన శాఖాధికారి సొహైల్ అహ్మద్ అన్నారు. లక్ష్మీపురం, చిట్టేల, ఆంజనేయపురం గ్రామాల్లో గురువారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నీటి వనరులు ఉన్న తోటల్లో ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలమని వివరించారు. పతంజలి ఫుడ్స్ సహకారంతో ఉద్యాన శాఖ ఆయిల్ పామ్ మొక్కలను ఔత్సాహిక రైతులకు ఉచితంగా సరఫరా చేస్తోందని, సాగు ఖర్చుల నిమిత్తం ఏడాదికి హెక్టారుకు రూ. 5,250 చొప్పున రాయితీ కల్పిస్తామని చెప్పారు. ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటల సాగుకు కూడా రాయితీ వర్తిస్తుందన్నారు. సూక్ష్మ సేద్య పథకంలో ఉద్యాన పంటలకు, మొక్కజొన్నకు ఐదు ఎకరాల లోపు 90 శాతం రాయితీ, ఐదు ఎకరాల పైన సాగు చేసే రైతులకు 50 శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను అందజేస్తామని తెలిపారు. ఆరుతడి పంటలైన అపరాల్లో 50 శాతం రాయితీతో స్ప్రింక్లర్లను అందిస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి కోస్తాంధ్రలో ప్రచార రథం పర్యటన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గామల్లేశ్వరస్వామి వార్ల ప్రచార రథం గోదావరి జిల్లాలో ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆలయ డీఈవో రత్నరాజు తెలిపారు. దుర్గగుడి కనకదుర్గనగర్‌లో గురువారం రాత్రి ప్రచార రథానికి జెండా ఊపి ప్రారంభించారు. తొలుత ప్రచార రథంపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వరస్వామి వార్లకు పూజలు నిర్వహించగా, రథానికి ఆలయ వైదిక కమిటీ సభ్యులు ఆర్. శ్రీనివాస శాస్త్రి కొబ్బరి కాయ కొట్టారు. 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు తణుకు, మడికి, సిద్ధాంతం, జగ్గంపేట, యర్రవరం, ఏలేశ్వరంచ, లక్ష్మీపురం, కిమ్మూరు, గొంటివాని పాలెం, జె. అన్నవరం, పులుగోగులపాడు, మంగంపాడు, మారేడుబాక, రత్నాలపేట సెంటర్, బలిజపాడు, వంచంగి, జి.కొత్తపల్లి, కరుదేవపాలెం, దుర్గానగర్, చికిలింత, వణకరాయి. జడ్డంగి, దూసరపాము, కెడి. పేట, పెద్దవలస, అంతర్ల, లోతుగడ్డ జంక్షన్, చింతపల్లి, పెదజడమూరు, జి. మాడుగుల, పాడేరు. పెదకొండమ్మ ఆలయం, అరకువ్యాలీ, నెలిమర్ల, రామతీర్థం, సతివాడలలో ప్రచారం నిర్వహిస్తుంది.

పోతురాజుకు ప్రత్యేక పూజలు

నందిగామ టౌన్: పట్టణ సమీపంలోని అనాసాగరం మునేటి పంట కాలువ వద్ద గురువారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య రైతులతో కలిసి పోతురాజుకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కోతల సమయంలో పోతురాజుకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను రైతులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.